# క?థన కుతూహలమ్?

రెండుమాట్లు జెయిలు కెళ్ళొచ్చాడని, వెంకటయ్యగార్ని చూస్తే మా ఇంట్లో వాళ్ళందరికీ పెద్ద భయం, ముఖ్యంగా మా ఆవిడకి.

అలాంటిది—

నెల్లాళ్ళ క్యాంపు తరవాత ఇంటికొచ్చిన రోజున, ఆయన రాసిన "జైలు అనుభవాలు" అనే పుస్తకం మేం పడుకునే మంచం మీద కనబడగా—

"ఆయన రచనలు కూడా ఆయన మాటల్లాగే కఠినంగా, నిర్మొహమాటంగా వుంటాయి!" అన్నాను అనవసరంగా మాట్లాడానని అనుకుంటూనే.

"అబ్బ! నిజమే బాబూ, ఆయన అలాగే మాట్లాడతారు! ఆయన చెప్పేదే రయిటూ, మిగతావాళ్ళు చెప్పేదంతా శుద్ధ తప్పూ అన్నట్టు!"

"ఒక్కొక్కరి తీరే అంత" అన్నాను; వెంకటయ్యగారిని సమర్థించకుండా వుండలేకానూ. ఆ మాట మా ఆవిడకి తెలిస్తే నాకు ఇబ్బందైనట్టూనూ, రెండు భావాలు వొకే మాటలో కలిపి.

"మీకూ ఆయనకీ పరిచయం యెలాగు అసలు?"

"పరిచయం అంటూ పెద్దగా లేదనుకో. ఆయన హిస్టరీ ప్రొఫెసరు. మానవతావాది. ఒకరొకరు దోపిడీ చేసుకునే ఈ సమాజం అంటే అతనికి మంట. దేశం నలుమూల్లా ఎక్కడెక్కడ ఎలా యెలా దోపిడీ జరుగుతుందో వినీ, చూసీ అతను బోలెడు లెక్చర్లిచ్చాడు. మన ప్రాంతంలో కామందులకీ, కమతగాళ్ళకీ మధ్య సంబంధాలని పరిశీలించి ఎలక్షన్ టయిమ్‌లో ఉపన్యాసం యివ్వడానికి సిద్ధం అవుతూ, అందు కోసం కొన్ని వూళ్లు తిప్పమన్నాడు తనని. నీకు గుర్తులేదూ; అప్పుడు మేం యిద్దరం మోటార్ సైకిల్‌మీద ఏజెన్సీలు తిరిగొచ్చేం కదా!"

"ఔనౌను. అతని పార్టీ పేరేమి టన్నారు?"

"ప్రత్యేకం ఫలానా పేరని లేదు. కాని, అతని ఉపన్యాసాలు వింటే అతను సపోర్టు చేస్తున్న అభ్యర్థికి వోట్లు వెయ్యడం ఖాయం!"

"లోకనాథంగారికి బాగా ఫ్రెండనుకుంటాను; కదూ ?"

"ఆయనకే గాదు. సంసారరావుగారు, లక్ష్మీనివాసరావుగారు-లాంటి మేధావులంతా స్నేహితులే."

"ఔను. ఆ మేధావులందర్నీ ప్రభుత్వం వరసగా సత్కరించింది కదా."

"మేధావులని ప్రభుత్వం సత్కరించడంలో రాజకీయపు ఎత్తుగడని మొదటిసారిగా గ్రహించింది. వెంకటయ్యగారే ఒరే, నాయనలారా! సత్కారాలు చూసుకుని పొంగి పొయ్యిలో పడకండి. ఇవాళ సత్కరించిన ప్రభుత్వం రేపట్నుంచి మిమ్మల్ని తనకి విధేయులుగా వుండమంటుంది. తస్మాత్ జాగ్రత్త- అని హెచ్చరించినవాడు వెంకటయ్యగారే."

"అన్నట్టు కిష్టారావుగారు కూడా ఈయన పార్టీయేగా ?"

"అవునూ !"

"ఆయన్నీ సత్కరించిందనుకుంటాను కదూ ప్రభుత్వం ?"

"కాని, ఆయన ఆ సత్కారం అందుకోలేదు."

"ఎంచేత, అలాగు ?"

"ఆయన నిజంగా పేదల మనిషి కనక__"

"ఆయన నిజంగా పేదల మనిషి అనడం సంగతి అలావుంచి, ఆయన పేదవాడన్నది మాత్రం యధార్థం. మిగతా వాళ్ళంతా అంతో యింతో వున్నవాళ్ళేను, ప్రభుత్వ సత్కారం అందుకొని అటు కీర్తి, యిటు ధనమూ గుంజుకున్నారు. కిష్టారావుగారి దగ్గిర కొచ్చేసరికి నువ్వు పేదల మనిషివి; ఈ సత్కారం నువ్వు అందుకొంటే వట్టాయనా మన పార్టీమీద వొట్టే సరి- అంటూ ఆయనకి ఆ వెయ్యి రూపాయలూ రాకుండా చేసేశారు; అంతేగా ?"

"అలా అనికాదు-" అని మొహమాట పడ్డాను.

"ఏమో, నాకెందుకొచ్చిన గొడవలెండి. మీరు ఆ ముఠాలో లేరు. అంతేచాలు నాకు" అంటూ మా ఆవిడ అటు తిరిగి పడుకుంది.

"వెంకటయ్యగారు సామాన్య మానవుళ్ళాగ ఆయన ఉపన్యాసాలన్నీ ఊకదంపులాగా కనిపిస్తున్నట్టుంది నీకు. చాలా పొరపాటు సుమా !" అన్నాను కోపంగా.

"అలా నాకేం అనిపించడం లేదులెండి."

"మరెలా గనిపిస్తున్నాది ?" అని డబాయించాను.

మళ్ళీ యిటు తిరిగింది మా ఆవిడ. "పేదవాళ్ళని మరింత పేదవాళ్లుగా, ధనవంతుల్ని మరింత ధనవంతులుగా మార్చే ఈ వ్యవస్థ తప్పని ఆయన సిద్ధాంతం. కులం, మతం లాంటి మూఢనమ్మకాలు పోవాలనీ, వరకట్నం లాంటి దురాచారాలు నశించాలనీ ఆయన ఆదర్శం. నా కెందుకు తెలీదు ?" అంది.

"మరి ఆయన్ని వేళాకోళం చెయ్యడ మెందుకూ ?"

"నేనేం వేళాకోళం చెయ్యడంలేదు. ఉన్నమాటే అంటున్నాను."

"ఏమిటి; నువ్వు విన్నమాట ?"

"తమ్ముడికి పెళ్ళి చేశాడుగా—"

''సుబ్బయ్యకి పెళ్ళి చేసేడా ? ఎప్పుడూ ?''

''కిందటాదివారం, ఆ వేళకి మీరు కలకత్తా వదిలేసి భువనేశ్వరం వొచ్చేసి వుంటారు. సమంగా యడ్రస్ తెలీక మీకా కార్డు పంపలేదు నేను- వాళ్ళ కులం అమ్మాయినే చేశారు.''

''అయ్యో; కంగ్రాచ్యులేషన్స్ పంపివుండేవాణ్ణే !'' అని నొచ్చుకున్నాను.

''ఇప్పుడు మాత్రం ఏమైంది ? రేపు తెల్లారి ఇవ్వండి. టెలిగ్రాం !"

''యామని ?''

''లక్ష పాతికవేలకి కంగ్రాచ్యులేషన్స్ అనివ్వండి, చాలు.''

''అదేమిటది ?''

''అంతే ఇచ్చారు. ఆ అబ్బాయికి కట్నం, అదేలెండి ? అంతే పుచ్చుకో గలిగారు వెంకటయ్యగారు....''

(2-9-78)